నేడు చౌటుప్పల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



దశ, చౌటుప్పల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నారు. చౌటుప్పల్‌లోని గాంధీ పార్క్ వద్ద సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ వేడుకల్లో మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాజానికి సేవ చేసే మనస్తత్వం ఉండాలె

❖ *బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి*



దశ ఓయూ: సమాజానికి సేవ చేసే మనస్తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. విశ్వబ్రాహ్మణ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పండకండి నరసింహ చారి జన్మదిన వేడుకలు హైదరాబాదులోని బీసీ కుల సంఘాల కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గణేష్ చారి హాజరై శాలువాతో సత్కరించి పూల బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ సమాజంలో మనం బ్రతుకుతూ ఇతరులను బ్రతికిస్తూ ఉపాధి కల్పించడం గొప్ప విషయమన్నారు. ఆ లక్షణాలను నరసింహ చారి అందిపుచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, వనజ, అరవింద్ కుమార్, లహరిక, లాస్య, వల్లబోజు నరసింహాచారి, తాటికొండ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా వర్సిటీలో సీఐఎస్‌సీఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

❖ *షాట్‌పుట్‌లో రికార్డు సృష్టించిన మహారాష్ట్ర క్రీడాకారిణి*



దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీలో సీఐఎస్‌సీఈ ఏడో జాతీయ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆధ్వర్యంలో వర్సిటీలోని సింథటిక్ అథ్లెటిక్స్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలికలు తమ క్రీడా ప్రతిభను చాటుకోనున్నారు. అంతర్జాతీయ అథ్లెట్ ఎం.కల్పనా రెడ్డి, డాక్టర్ గాడ్విన్ డేనియల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అండర్-19 బాలికల షాట్‌పుట్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన సామి జయదీప్ పాటిల్ 14.69 మీటర్ల దూరం బంతిని విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ క్రమంలో గతంలో ఉన్న 12.01 మీటర్ల రికార్డును అధిగమించారు. నార్త్ ఇండియాకు చెందిన తన్వీర్ కౌర్ సిద్ధూ 13.54 మీటర్లతో రెండో స్థానం సాధించగా, మహారాష్ట్రకు చెందిన సామి నాయక్ మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులు ఈ పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి అవకాశం లభించిందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల క్రీడా సమన్వయకర్త, పాఠశాల ప్రిన్సిపల్ థెరిసా తెలిపారు.





భూ సమస్యలకు పరిష్కారం ఎక్కడ?

లంచం ఇవ్వనిదే పని జరగదా?

- రూ.30 లక్షల డిమాండ్ ఆరోపణలు.. రూ.20 లక్షల లంచం కేసుతో కలకలం.
- ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు..
- ఉన్నతాధికారులు స్పందించేదేప్పుడు?

దశ, అబ్దుల్లాపూర్‌మెట్

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తే న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వచ్చే సామాన్యులకు నిరీక్షణే మిగులుతోందా? భూ సర్వేలు, నివేదికలు, రికార్డుల సవరణ వంటి పనుల కోసం రైతులు, భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా వెలుగులోకి వచ్చిన లంచం కేసు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందాల్సిన చోట ఇలాంటి ఆరోపణలు రావడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

రూ.30 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలు

మండల పరిధిలోని పసుమాముల గ్రామానికి చెందిన భూమి వ్యవహారంలో సర్వే నంబర్ 137/2కు సంబంధించిన సర్వే నివేదిక జారీ చేసేందుకు రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో రూ.20 లక్షల లంచం తీసుకుంటూ మండల సర్వేయర్ పట్టుబడిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సేవల కోసం ఇంత భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఎంతవరకు ఉంది? లంచం డిమాండ్ వెనుక ఇతరుల ప్రమేయం ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణతో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఆరోపణలు నిర్ధారణ అయ్యే వరకు సంబంధిత వ్యక్తులపై తుది నిర్ణయానికి రాకుండా, విచారణ నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉంది. భూముల సర్వేలు, హద్దుల నిర్ధారణ, సర్వే నివేదికలు, రికార్డుల సవరణ వంటి పనుల కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో పనులు ఆలస్యమవుతున్నాయని, ఒకే పని కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణీత సమయంలో సేవలు అందకపోతే రైతులకు ఆర్థిక భారం పెరగడమే కాకుండా మానసిక ఒత్తిడిని కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రతి భూ సమస్యను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించే విధంగా పారదర్శక వ్యవస్థను బలోపేతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

2019 ఘటన.. ఇప్పటికీ మరువలేని విషాదం



గత ఎమ్మార్వో విజయారెడ్డి (ఫైల్).


అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ కార్యాలయం పరిధిలో 2019లో చోటుచేసుకున్న దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి తహసీల్దార్ విజయారెడ్డిపై ఓ రైతు పెట్రోల్‌తో దాడి చేసిన ఘటనలో ప్రాణనష్టం సంభవించింది. భూ వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన రెవెన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారం, ప్రజలతో అధికారుల వ్యవహారశైలిపై విస్తృత చర్చకు దారితీసింది. ప్రస్తుత లంచం కేసు నేపథ్యంలో ఆ ఘటనను గుర్తుచేసుకుంటున్న స్థానికులు, భూ సమస్యలు తీవ్ర వివాదాలకు దారితీయకుండా సత్వర పరిష్కార మార్గాలు ఉండాలని అభిప్రాయపడుతున్నారు. అయితే, గత ఘటనకు, ప్రస్తుత లంచం కేసుకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని చెప్పడానికి ఆధారాలు లేవు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏది?

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడం అధికారుల బాధ్యత. భూ సర్వేలు, నివేదికలు, రికార్డుల సవరణల్లో జాప్యం జరగకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలి. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి గడువు నిర్ణయించాలని ప్రజలు కోరుతున్నారు. లంచం డిమాండ్లు, వేధింపులపై వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా విచారణ చేపట్టాలని, తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో నిరాధార ఆరోపణల వల్ల ఎవరికీ అన్యాయం జరగకుండా విచారణ నిష్పక్షపాతంగా సాగాలి. అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన ప్రతిసారీ విచారణకు ఆదేశించడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు కనిపించాలి. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో సేవల తీరుపై సమీక్ష నిర్వహించి, పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు లంచం కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రజలకు న్యాయం అందించాల్సిన రెవెన్యూ కార్యాలయాలపై నమ్మకం నిలబెట్టడం, పారదర్శకతను పెంచడం ఉన్నతాధికారుల ముందున్న కీలక బాధ్యత.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికలు

❖ *15 రోజుల్లో గ్రామస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలి*



దశ, రంగారెడ్డి ప్రతినిధి : ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీరు, పశుగ్రాసం, రబీ సాగు, గ్రామీణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.


మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. గత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాల లభ్యత తగ్గే అవకాశం ఉందని, రానున్న తొమ్మిది నెలల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ప్రతి గ్రామంలో తాగునీటి వనరులను గుర్తించి, పైపులైన్ల లీకేజీలు, బోర్లు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పశువులకు నీరు, పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, వరి గడ్డిని సేకరించి నిల్వ చేసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను బట్టి రబీ పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. వర్షాభావంతో వ్యవసాయ పనులు తగ్గితే గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పనులను ముందుగానే గుర్తించాలని సూచించారు. మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యలు, అవసరాలను గుర్తించాలని, 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి అమలును పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయి, డీఆర్వో శారదాదేవి, సీపీఓ సౌమ్య, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీది అరాచక వైఖరి: బూర నర్సయ్య గౌడ్

❖ *ఓట్ల చోరీ ఆరోపణలు కాంగ్రెస్ మైండ్‌గేమ్.*



దశ, హైదరాబాద్ : దేశంలో కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించి ప్రజాస్వామ్య వ్యవస్థలను అస్థిరపరిచేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ నిరసనల పేరుతో వ్యవహరిస్తున్న తీరు సరికాదని వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి స్వతంత్ర సంస్థలపై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. దేశంలో 13 కోట్ల ఓట్ల చోరీ జరిగిందన్న ఆరోపణలు కాంగ్రెస్ రాజకీయ వ్యూహంలో భాగమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులకు సంబంధించి కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై బహిరంగంగా చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో సహా రాష్ట్రంలోని ఏ పోలింగ్ బూత్‌లోనైనా పరిశీలనకు రావాలని సవాల్ విసిరారు.

నిరసనల సందర్భంగా మహిళా పోలీసులు, జర్నలిస్టుల పట్ల దురుసుగా వ్యవహరించారంటూ రాహుల్ గాంధీపై ఆరోపణలు చేశారు. న్యాయవ్యవస్థపై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ నాయకత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై పలు రాజకీయ విమర్శలు చేశారు.

గడువు ముగిసిన అనుమతులతో క్వారీ నిర్వహణ?

❖ *శ్రీ జై లక్ష్మి స్టోన్ క్రషర్‌లో విజిలెన్స్ తనిఖీలు*

❖ *అనుమతులపై ఆరా.. క్వారీ నిర్వహణ తీరుపై అధికారుల పరిశీలన*



దశ, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామ పరిధిలోని శ్రీ జై లక్ష్మి స్టోన్ క్రషర్ క్వారీలో మంగళవారం వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 137/1లో కొనసాగుతున్న క్వారీ కార్యకలాపాలపై వచ్చిన సమాచారంతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.

క్వారీ నిర్వహణకు సంబంధించిన అనుమతుల గడువు ముగిసినప్పటికీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు రావడంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో క్వారీకి సంబంధించిన అనుమతి పత్రాలు, నిర్వహణకు అవసరమైన అనుమతుల వివరాలు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యకలాపాల గురించి ఆరా తీసినట్లు సమాచారం. సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు క్వారీ నిర్వహణ తీరును అధికారులు తనిఖీ చేసినట్లు తెలిసింది.

మైనింగ్ కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతున్నాయా? అవసరమైన అనుమతులు అమల్లో ఉన్నాయా? అనుమతుల గడువు ముగిసిన తర్వాత కూడా తవ్వకాలు లేదా క్రషింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టడంతో క్వారీ నిర్వహణకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తనిఖీల్లో అధికారులు గుర్తించిన అంశాలు, సేకరించిన వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే, క్వారీలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారులు గుర్తించిన అంశాలు, తదుపరి చర్యలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అపార్ ఐడితో నకిలీకి చెక్

- అంబేద్కర్ యూనివర్సిటీలో సక్సెస్ఫుల్
- అదే బాటలో ఇతర యూనివర్సిటీలు
- నకిలీ సర్టిఫికెట్లకు చెక్
- పెరుగుతున్న డీజిటల్ లాకర్ భద్రత
- అసలు, నకిలివి గుర్తించడం ఇక ఈజీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు



దశ,తాండూర్ ప్రతినిధి : విద్యార్థుల కోసం 'అపార్ కార్డులు' డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ కొత్త విధానం తీసుకువచ్చింది. విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థుల వివరాలను ఒకే చోట ఉంచేందుకు డిజి లాకర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు 1.2 లక్షల మంది వివరాలు దాంట్లో నమోదు చేయాలి.రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్‌తో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుతున్న విద్యార్థుల సమగ్ర వివరాలన్నింటినీ ఒకే చోట ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం కొత్తగా అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డును అందుబాటులోకి తెచ్చారు. దూరవిద్య ద్వారా చదువుతున్న విద్యార్థులకు మొదటిసారిగా ఈ కార్డును ఇస్తున్నారు.

దీని ద్వారా అందులో చదువున్న విద్యార్థుల వివరాలను డిజి లాకర్‌లో భద్రపరుస్తున్నారు. డిజి లాకర్‌లో విద్యార్థి పేరు, విద్యార్హతలు, గతంలో అభ్యసించిన చదువుతో పాటు ఇతర వివరాలన్నింటినీ ఇందులో పొందుపరుస్తారు. ఈ డిజి లాకర్‌లో వివరాలను నమోదు చేయాలంటే అపార్ కార్డు ముఖ్యమైనది. దీనికోసం ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికీ ఒక నంబర్ ఇచ్చి అపార్ కార్డును అందిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు

ఈ కార్డు డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందినప్పటి నుంచి కోర్సు పూర్తయ్యే వరకు ఈ కార్డు చెల్లుబాటులో ఉంటుంది. ఈ ప్రక్రియను అధికారులు గత విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. ఇప్పటివరకు 1.2 లక్షల మంది విద్యార్థుల వివరాలు డిజిలాకర్‌లో పొందుపరిచారు.

అందులోని సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు. అప్‌డేట్ చేసిన వివరాలన్నీ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌లో నమోదు చేస్తారు. ఇందులో విద్యాప్రయాణం, సాధించిన విజయాలు ఉంటాయి. ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి అపార్ కార్డుకు ఒక ప్రత్యేకమైన నంబర్ ఉంటుంది. విద్యార్థుల వివరాలన్నీ ఇందులో నమోదు కావడం వల్ల వారికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి.

నకిలీవా నిజమైనవా తెలుసుకునేందుకు

దూరవిద్య విధానం ద్వారా చాలా మంది డిగ్రీ, పీజీ పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత విద్యార్థులంతా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్తున్నారు. ఉన్నత విద్య, పరిశోధనలతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం రాష్ట్రాన్ని వీడి వెళ్తున్నారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలు జారీ చేసిన సర్టిఫికేట్లు నిజమైనవా? నకిలీవా అనే అనుమానం కలుగుతుంది. ఆ అనుమానాలన్నింటినీ డిజి లాకర్ నివృత్తి చేస్తోంది.

ఎందుకంటే దీంట్లో విద్యార్థికి సంబంధించిన విద్యార్హత వివరాలన్నీ ఉంటాయి. దీంతో ఉద్యోగాలిచ్చే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, బ్యాంకులు సంబంధిత అధికార వర్గాలకు మన వివరాలు సృష్టంగా అర్థమవుతాయి.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ

ఒకప్పుడు డిగ్రీలకే పరిమితం ఇప్పుడేమో కార్పొరేట్ ఉద్యోగాల మార్గదర్శి. నూతన పోకడలతో సరికొత్త విధానంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దేశంలోనే అత్యున్నతమైన స్థాయిలో నిలిచింది.

అటు స్టడీ అందించడంతోపాటు ఉద్యోగాలు కల్పించడంలో కూడా ముందు ఉంది. ఏ ప్లస్ గ్రేడ్ తో ముందు వరసలో ఉంది. దేశంలోనే అన్ని యూనివర్సిటీలలో అత్యుత్తమైన యూనివర్సిటీగా కూడా ఒకటి గుర్తింపు పొందింది. రాబల్లి భవిష్యత్తు తరాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగస్తులకు విద్యార్థులకు ఇతరులకు అందరికీ మార్గదర్శిగా నిర్వహింది.

అపార్ ఐడి ఎంతో మేలు



"అపార్ ఐడి తో నకిలీవి గుర్తించడం ఇక ఈజీ అయింది. డిజి లాకర్లో అన్ని సర్టిఫికెట్లు భద్రపరచడం చాలా సంతోషంగా ఉంది. నేను ఇప్పటికే బిఎల్ ఐ ఎస్ సి కంప్లీట్ చేశాను. ఇప్పుడు ఎం.ఎల్.ఐ.సీ, చేస్తున్నాను. నాకు బిఎల్ఐఎస్సి నుంచి అపార్ ఐడి ఉంది.ఇక్కడ ఎం.ఎల్.ఐ.సీ కి తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే ఒక విద్యార్థికి ఒకసారి మాత్రమే ఒక యూనివర్సిటీలో అపార్ ఐడి ఇస్తారు. అందులోని మనం చదివిన అన్ని సర్టిఫికెట్లు అప్లోడ్ చేస్తారు. కాబట్టి ఇది చాలా భద్రంగా ఉంటుంది. ఎలాంటి మోసానికి అవకాశం ఉండదు.

– కృష్ణవేణి,
ఎం.ఎల్.ఐ.సి విద్యార్థి, తాండూర్.

బతుకమ్మ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

❖ *ఈ నెల 14న రాష్ట్రస్థాయి.. 15న రంగారెడ్డి జిల్లా స్థాయి వేడుకలు*



దశ, రంగారెడ్డి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి సమక్షంలో జిల్లా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ విషయాన్ని టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డా. కె. రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటాలని ఆకాంక్షించారు. టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రేవతి మాట్లాడుతూ.. ఈ నెల 14న హైదరాబాద్‌లోని నాంపల్లి టీజీఓ భవన్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు, 15న రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శాంతిశ్రీతో పాటు డి. సైదమ్మ, బాలేశ్వరి, రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య, స్వాతి, పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను,పుల్లమ్మ,ప్రశాంతి,మమత,శ్రీలత,భవానితదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం జారీ చేసిన జీవో31పై అభ్యంతరాలు..

❖ *యూజీసీ నిబంధనలు పాటించలేదన్న టీడీపీ*

దశ ఓయూ: తెలంగాణ ఉన్నత విద్యా శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన జీవో నెంబర్ 31లో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా పలు అంశాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు కొత్తగా నిబంధనలు పెట్టడం సరైనది కాదన్న వాదనలు వినిపిస్తున్నారు. ఎంట్రీ లెవల్‌లో ఉండే పోస్టుకు అసోసియేట్ ప్రొఫెసర్‌కు పెట్టే అర్హతలను అసిస్టెంట్‌కు పెట్టడం అభ్యంతరకరమంటున్నారు. ముఖ్యంగా అనుభవజ్ఞులను దూరం పెట్టేందుకు ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఎందుకంటే.. 10 ఏళ్ల క్రితం డిగ్రీ, పీజీ పరీక్షల్లో యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు తక్కువ శాతం మార్కులు వేసేవారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే ఇప్పుడు 10 ఏళ్ల క్రితం పీజీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎందుకంటే.. ప్రభుత్వం జారీ చేసిన కొత్త జీవోలో.. డిగ్రీలో 80 శాతం పైన మార్కులు సాధించిన వారికి 15 మార్కులు కేటాయించడమే తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

ముఖ్యంగా సోషల్ సైన్స్ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ మధ్య కాలంలో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అధిక శాతం మార్కులు రావడం వల్ల.. సీనియర్ విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తెలంగాణ డాక్టరేట్ అసోసియేషన్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ తిరుపతి బొల్లం, సలహాదారు డాక్టర్ రమణరావు, ప్రతినిధులు కట్కూరి, మహేందర్. ఇక డిగ్రీలో 80 నుంచి 60 శాతం వచ్చిన వారికి 13 మార్కులు, 50 నుంచి 60శాతం వచ్చిన వారికి 10 మార్కులు, 55 నుంచి 45 శాతం వచ్చిన వారికి 5 మార్కులు కేటాయించారు. అయితే.. ఇక్కడ 30 ఏళ్లు పై బడిన అభ్యర్థులకు డిగ్రీలో తక్కువ మార్కులు రావడమే ఈ వివాదానికి కారణమంటున్నారు డాక్టరేట్ అభ్యర్థులు. ఇక మూక్స్, ఇంటర్నేషనల్ ఇన్విటేషన్, పరిశోధన అభ్యర్థులకు కూడా జీవో 31లో ప్రధానత్య ఇవ్వడం వల్ల అసలైన పరిశోధన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. పరిశోధన అసోసియేట్‌కు మార్కులు ఇవ్వడం మనేది యూజీసీలో లేదని గుర్తు చేస్తున్నారు టీడీఏ ప్రతినిధులు.

ఈ జీవోని బట్టి చూస్తే.. 30 ఏళ్లు దాటిన వారికి ఉద్యోగాలు ఇవ్వకూడదనే కుట్ర చేస్తుంది ప్రభుత్వం. మార్కులను చూసి జాబులు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. అదే.. అసిస్టెంట్ ప్రొఫెసర్ విషయంలో యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా పలు నిబంధనలుపెట్టారని టీడీఏ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. విదేశాల్లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారని జరుగతున్న ప్రచారం కూడా మంచి పద్ధతి కాదని అంటున్నారు.



భూవివాదంలో రైతు ఆత్మహత్య

కాంగ్రెస్ నేత పత్తి కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని టీఆర్పీ డిమాండ్...

దశ, హుజురాబాద్: భూవివాదం కారణంగా హుజురాబాద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రైతు కన్నబోయిన ఓదెలు ఆత్మహత్యకు కారణమైన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గ్రామ సర్పంచ్ పత్తి అనిత భర్త పత్తి కృష్ణారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున హుజురాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజురాబాద్ మండలం వెంకట్రావుపల్లికి చెందిన కన్నబోయిన ఓదెలు 2018లో పత్తి విష్ణువర్ధన్ రెడ్డి (పత్తి కృష్ణారెడ్డి సోదరుడు) నుంచి 1 ఎకరం 4 గుంటల భూమిని సాదా బైనామా ద్వారా 10.లక్షలు40 వేలు చెల్లించి కొనుగోలు చేశారు. అయితే కుటుంబ తగాదాలు, న్యాయపరమైన వివాదాల వల్ల ఆ భూమి రిజిస్ట్రేషన్ ఆలస్యమైంది.

దీన్ని ఆసరాగా చేసుకున్న సర్పంచ్ భర్త పత్తి కృష్ణారెడ్డి, 2022లో రెవెన్యూ అధికారులతో కలిసి ఆ భూమిని తన పేరిట నమోదు చేసుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, గతంలో తీసుకున్న పూర్తి మొత్తాన్ని చెల్లించకుండా, కేవలం 2.70 లక్షలు మాత్రమే ఇస్తానని, "దిక్కున్న చోట చెప్పుకోండంటూ" బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు.

తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్య...

ఈ బెదిరింపులు, అన్యాయంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓదలు గత నెల 2వ తేదీన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ 3వ తేదీన మృతి చెందారని రజిని కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు.

పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు – ఆందోళన హెచ్చరిక

బాధిత యాదవ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని, తక్షణమే నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎస్ హెచ్ ఓ కు వినతిపత్రం అందజేశామని, కరీంనగర్ సీపీ, ఏసీపీలకు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. పత్తి కృష్ణారెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి భూమి దక్కేలా చేయకపోతే స్థానిక నాయకత్వంతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీఆర్పీ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, బొడ్డు దేవదాస్, బొడ్డు సుమన్, ఇమ్మడి ఉదయ్ కుమార్, తామన్ రామన్ కుమార్, మృతుని కుమారుడు కన్నెబోయిన కుమారస్వామి లు తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చాకే వర్సిటీ పోస్టుల భర్తీ చేపట్టాలి

❖ *1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి*

❖ *రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య సమక్షంలో అధ్యాపకుల అత్యవసర సమావేశం*



దశ ఓయూ: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, యూజీసీ ఏడో వేతన సవరణ సంఘం (7వ పీఆర్సీ) ప్రకారం వేతనాలు అమలు చేసిన తర్వాతే ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టాలని విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గత ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగ భద్రత, రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు 11 రోజులపాటు నిరవధిక సమ్మె నిర్వహించారు. దీంతో విశ్వవిద్యాలయాల్లో బోధన నిలిచిపోయింది. అప్పట్లో ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో అధ్యాపకులు సమ్మె విరమించారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ప్రభుత్వం జీవో నంబరు 31 ద్వారా ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.20-30 ఏళ్లుగా సేవలందిస్తున్నాం. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో సుమారు 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులు గత 20 నుంచి 30 ఏళ్లుగా సేవలందిస్తున్నారని సమావేశంలో పేర్కొన్నారు. నియామకాలు చేపడితే తమ ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, పని భారం లేదనే కారణంతో తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అర్హులైన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు రెగ్యులర్ అధ్యాపకులుగా క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఏడో పీఆర్సీ వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపక సంఘం నాయకులు డా. పరుశురాం, డా. ధర్మతేజ, డా. వెంకటేశ్వర్లు, డా. మోడెమ్ రవి, డా. తిరుపతి, సమర కుమార్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధర్నాలు చేస్తే కఠిన చర్యలు: ఏ.సి.పి. మాదవి హెచ్చరిక

దశ, హుజురాబాద్ : సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాలి తప్ప, జాతీయ రహదారులపై ధర్నాలు నిర్వహించి ప్రజారవాణాకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ఏ .సి.పి.మాధవి స్పష్టం చేశారు. మంగళవారం రోజున టౌన్ సి.ఐ. కరుణాకర్ తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సైదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన బజ్జూరి తిరుమల (57) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 9న క్రైమ్ నెం. 179/2026 (U/Sec. 118(2), 292, 351(2) r/w 3(5) బీ ఎన్ ఎస్) కింద కేసు నమోదు చేసి, విచారణ అనంతరం బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. అయితే, తిరుమలకు అన్యాయం జరిగిందంటూ చల్లూరి కోమల, మొలుగురి లక్ష్మి మరికొందరు మహిళలను కూడగట్టుకుని



ఈ నెల 11న ఏ.సి.పీ.ని కలిసేందుకు వచ్చారని చెప్పారు. ఆ సమయంలో తాను అందుబాటులో లేకపోవడంతో, వారు జాతీయ రహదారిపైకి వెళ్లి సుమారు 30 నిమిషాల పాటు ధర్నా చేపట్టారని పేర్కొన్నారు. దీనివల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో తిరుమల, చల్లూరి కోమల, మొలుగురి లక్ష్మి సహా ఇతరులపై హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 308/2026 (యు/సే . 189, 126(2) బీ ఎన్ ఎస్) కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. గతంలోనూ వీరు బోర్నపల్లి గ్రామంలో ఇదే రీతిలో ధర్నా చేయగా హెచ్చరించామని, మళ్లీ పునరావృతం చేయడంతో చట్టరీత్యా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారులపై రోగులు, అంబులెన్సులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలకు వెళ్లేవారు ప్రయాణిస్తుంటారని, అలాంటి మార్గాల్లో రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులను ఆశ్రయించాలి తప్ప, ప్రజా జీవనానికి విఘాతం కలిగించడం సమంజసం కాదన్నారు.

చట్టంపై నమ్మకం ఉంచండి:
- ఏ.సీ.పీ.మాదవి

హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సాక్ష్యాధారాల ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. దర్యాప్తునకు కొంత సమయం పడుతుందని, ఫిర్యాదుదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఒకవేళ దర్యాప్తు విషయంలో ఎస్హెచ్ఓ పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు, సీ.ఐ.పై ఉంటే ఏ.సీ.పీ.కి, ఇతర అధికారులపై ఫిర్యాదులు ఉంటే పోలీస్ కమిషనర్ (సీపీ) గారికి లిఖితపూర్వకంగా విన్నవించుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి, ప్రజా రవాణాకు భంగం కలిగించవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.